ప్రజాశక్తి
ఆదివారం 7 డిసెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

గంటేడకు తాపీ ధర్మారావు పురస్కారం

పార్వతీపురం: గుంటూరుకు చెందిన బండికిఖల్లు ఫౌండేషన్ ప్రదానం చేయనున్న తాపీ ధర్మారావు పురస్కారానికి పట్టణానికి చెందిన కవి, రచయిత గంటేడ గౌరు నాయుడు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం గుంటూరు కొరటాల సమావేశమందిరంలో జరగనున్న కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. బండికిఖల్లు ఫౌండేషన్ విశాఖ సంస్కృతి మాసపత్రిక సౌజన్యంతో 9వ జాతీయ స్థాయి కథల పోటీలు నిర్వహించింది. ఈ పోటీల విజేతలకు అవార్డుల ప్రదానోత్సవంలో గౌరు నాయుడుకు తాపీ ధర్మారావు పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

విషాద యాత్ర

అయ్యప్పస్వామి దర్శనానికి కలసి వెళ్లిన ఆ బంధువులు, స్నేహితుల ప్రాణాలు మధ్యలోనే గాలిలో కలిసిపోయాయి. సుదీర్ఘ ప్రయాణంలో అలసి పోయి రాత్రిపూట రోడ్డు పక్కన కారులో నిద్రపోతున్న వారిని మృత్యువాత మరో కారు రూపంలో కబళించింది. ఈ ప్రమాదంలో కోరపు కొత్తవలసకు చెందిన ముగ్గురు, మరుపల్లి గ్రామానికి చెందిన మరొకరు మృతి చెందడంతో ఆయా గ్రామాల్లో తీవ్ర విషాదం అలుముకుంది.

- శబరిమల వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం, మరొకరికి తీవ్ర గాయాలు
- రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును ఢీకొన్న మరో కారు
- కోరపుకొత్తవలస, మరుపల్లిలో విషాదం

ప్రమాదానికి గురైన కారు

ప్రజాశక్తి-దత్తిరాజేరు

తమిళనాడు రాష్ట్రం రామేశ్వరం సమీపంలో శుక్రవారం రాత్రి 2గంటల సమయంలో ఆగి ఉన్న కారును మరో కారు ఢీకొన్న ఘటనలో దత్తిరాజేరు మండలం కోరపు కొత్తవలసకు చెందిన ముగ్గురు, గజపతినగరం మండలం మరుపల్లి గ్రామానికి చెందిన ఒకరు దుర్మరణం చెందారు. కొండ కెంగువ గ్రామానికి చెందిన మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. దత్తిరాజేరు మండలం కోరపు కొత్తవలసకు చెందిన వంగర రామకృష్ణ (51), మార్పిన అప్పలనాయుడు (33), మరడ రాము (50), మరుపల్లికి చెందిన బండారు చంద్రరావు (35) కలసి ఈనెల1న శబరిమలై అయ్యప్పస్వామి దర్శనానికి ఇక్కడి నుంచి కారులో వెళ్లారు. శబరిమలై కొండకు వెళ్లి దర్శనం అనంతరం వీరంతా తిరుగు ప్రయాణమయ్యారు. రామేశ్వరానికి 40కిలోమీటర్ల దూరంలో రామ నారాయణపురం దగ్గరకు వచ్చేసరికి నిద్ర వస్తుందని కారును రోడ్డుపక్కకు తీసి కారులోనే నిద్రించారు. అందరూ నిద్రలో ఉండగా వేగంగా వచ్చిన మరో కారు వీరి కారును వెనుకవైపు బలంగా ఢీకొంది. ఈ ఘటనలో రామకృష్ణ, అప్పలనాయుడు, మరడ రాము, బండారు చంద్రరావు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. కొండ కెంగువకు చెందిన బెవర శ్రీరామ్‌కు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసి కోరపు కొత్తవలస, మరుపల్లిలో తీవ్ర విషాదం అలుముకుంది.

రోదిస్తున్న మృతుల కుటుంబీకులు

రోడ్డు ప్రమాదంలో మృతులు

కుటుంబ నేపథ్యం

☞ మార్పిన అప్పలనాయుడుకు భార్య గాయత్రి, తల్లి రాములమ్మ తండ్రి తిరుపతి ఉన్నారు. షికారుగంజి రోడ్డు వద్ద చిన్న దుకాణం పెట్టుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు కావడం, కుటుంబాన్ని పోషించాల్సిన కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గతంలో కుమారుడు యాక్సిడెంట్‌లో చనిపోవడం, ఇప్పుడు అల్లుడు చనిపోవడంతో ఆదే గ్రామంలో ఉన్న అత్తామామలు రోదించారు.

☞ మరడరాముకు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య పైడితల్లి, కుమారుడు ప్రసాద్ ఉన్నారు. కుమారుడు డిగ్రీ పూర్తిచేసుకుని ఉద్యోగం కోసం ప్రిపేర్ అవుతూ కోచింగ్ తీసుకుంటున్నాడు. తండ్రి చనిపోయాడని తెలియడంతో తల్లి కొడుకు కన్నీరు మున్నీరయ్యారు.

☞ వంగర రామకృష్ణకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు భవాని, లత ఉన్నారు. వీరు డిగ్రీ చదువుకొని ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్నారు. తండ్రి వ్యవసాయం పని చేసుకుని కుటుంబాన్ని పోషించేవాడు. రామకృష్ణ మృతితో కుటుంబ సభ్యులు తామంతా ఎలా బతకాలని కన్నీరు గుండెలవిసేలా విలపిస్తున్నారు.

☞ గజపతినగరం మండలం మరుపల్లి గ్రామానికి చెందిన బండారు రామచంద్రరావుకు భార్య సత్యవతి, కుమారుడు ఉత్తేశ్, కుమార్తె శ్రీహిత ఉన్నారు. గ్రామంలో షికారుగంజి రోడ్డు వద్ద చిన్న టిఫిన్ కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. చిన్నపిల్లలు కావడంతో పిల్లల్ని ఎలా పోషించాలని భార్య సత్యవతి రోదనలు మిన్నంటాయి. ఒకే గ్రామానికి ముగ్గురు చనిపోవడంతో గ్రామంతో పాటు ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది.

విద్యార్థుల్లో ఆరోగ్యంతోపాటు ఆనందం : కలెక్టర్

విద్యార్థినిలతో ముచ్చటిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి, జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - సీతానగరం

విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య మరింత అనుబంధాన్ని పెంచడానికి, భయాన్ని తొలగించడానికి ఒక వినూత్న కార్యక్రమే మన్యం డాన్స్ అని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి అన్నారు. మండలంలోని జోగింపేట అంబేద్కర్ గురుకుల పాఠశాల, ప్రతిభ పాఠశాల కేజీబీవీ విద్యాలయాల్లో శనివారం పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, శారీరక ఆరోగ్యం, నైపుణ్యాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని, ప్రతి శనివారం ఉదయం 'హ్యాపీ డే' కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పిల్లలు, ఉపాధ్యాయుల మధ్య అనుబంధం తద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. మన్యం డాన్స్' కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నృత్యం, వ్యాయామం ద్వారా రోగ నిరోధక శక్తిని మెరుగుపరచడం, ఉల్లాసంగా ఉంటూ, బిడియం, భయం పోగొట్టి, నైపుణ్యాలు పెరిగేలా ప్రోత్సహించడం, 'ఆడుతూ పాడుతూ సంతోషంగా' గడిపేలా చేసి, పాఠశాల వాతావరణం 'హ్యాపీ ప్లేస్'గా అనిపించేలా చూడాలన్నారు. ప్రతి శనివారం ఉదయం ప్రేయర్ సమయంలో ఈ 'మన్యం డాన్స్' కార్యక్రమం కొనసాగుతుందని, విద్యార్థులు, ఉపాధ్యాయులు దీన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జెసి సి.యశ్వంత్‌రెడ్డి, ఎంఇఒ జి.సూర్యదేముడు, తహశీల్దార్ జై ప్రసన్నకుమార్, ఎంపిడిఒ ఎంఎల్ ప్రసాద్, ప్రిన్సిపల్ డి.రాజారావు, జె సంధ్య, ధర్మారావు, స్వచ్ఛంధ్రా డైరెక్టర్ బొమ్మినేని లక్ష్మణరావు, అధ్యాపకులు కె.ఈశ్వరరావు, సింహాచలం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సచివాలయ సర్వేయర్ మృతి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని పెదగొత్తిలి సచివాలయ ఉద్యోగి (సర్వేయర్) ఎప్పరికి తేజశ్వరి (26) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. ఆమె స్వగ్రామం గుమ్మలక్ష్మీపురం మండలం సీమలగూడ. సర్వే పనుల్లో చురుగ్గా పనిచేసేది. తేజేశ్వరి ఆకస్మిక మరణంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. తేజేశ్వరి మృతి పట్ల ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి బి.చంటి, సర్పంచ్ టి.లోకనాథం, సహెూద్యోగులు సీమలగూడ వెళ్లి సంతాపం తెలిపారు. విధుల్లో క్రమశిక్షణ, ప్రజలతో మృదువైన ప్రవర్తనకు పేరుగాంచిన ఆమె మరణం సచివాలయ సిబ్బంది గ్రామస్తులకు కలచివేసింది.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

దళారుల దోపిడీ అరికట్టండి

ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - సీతానగరం

ధాన్యం కొనుగోలులో దళారుల దోపిడీని అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించే వరి పంటకు ప్రభుత్వం క్వింటాకు మద్దతు ధర రూ.2,369 ప్రకటించినప్పటికీ రైతుల వద్ద 105 కేజీలు తీసుకుని రూ 2,069 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. దీంతో క్వింటా వద్ద రూ.300 వరకు రైతులు నష్టపోతున్నారన్నారు. అలాగే మిల్లర్ల దయాదాక్షిణ్యాలపై రైతులు ఆధార ఆధారపడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం అట్టహాసంగా గ్రామసభలు పెట్టి రైతన్న మీకోసం కార్యక్రమంలో విస్తృత ప్రచారం చేసి మద్దతు ధర ప్రకటించిందని, కానీ అది పత్రికలోకే పరిమితం, గ్రామ సభలో పెట్టినప్పటి నుంచి రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు ధాన్యం ఇప్పటి వరకు ఎంత వెళ్లింది, ఇంకా ఎంత మిగిలి ఉందన్న విషయం బహిరంగ ప్రచారం చేయడం లేదు. 24 గంటల్లో రైతులు ఖాతాలో డబ్బులు జమ చేస్తామని చెబుతున్నప్పటికీ, ఎక్కడా ఆ విధంగా డబ్బులు పడడం లేదన్నారు. దళారులు పంపించే ధాన్యానికి మాత్రం తక్షణమే డబ్బులు చెల్లిస్తున్నారని, రైతుల నుంచి కళాసీల ఛార్జీలు వసూలు చేస్తున్నారని, మిల్లర్ల యూనియన్ 10 కేజీలు డిమాండ్ చేస్తున్నారని, మండల జిల్లా స్థాయి అధికారులు ఈ విషయం పట్టీపట్టనట్లు చోద్యం చూస్తున్నారని అన్నారు. మిల్లర్లు, దళారులు, అధికారులు కలిసి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని, కావున తక్షణమే సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుని, ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి లక్ష్మునాయుడు, మండల నాయకులు బోరపరెడ్డి అప్పారావు, బల్ల నారాయణస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు అమోఘం : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పోలీస్ శాఖలో హోంగార్డుల సేవలు అమోఘమైనవని జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి కొనియాడారు. 63వ హోంగార్డుల ఆవిర్భావన దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పోలీస్ మల్టీ ఫంక్షన్ హాల్ మైదానంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్‌పి మాధవ్ రెడ్డి, ఎఎస్‌పిలు ఎం.వెంకటేశ్వరావు, మనీషా రెడ్డి వంగల, ఆర్మ్ డ్ రిజర్వు డిఎస్పీ థామస్ రెడ్డి హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పెరేడ్ కమాండర్ ఆర్ఎస్ఐ రమేష్ సారథ్యంలో హెూంగార్డ్స్ పెరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ హోంగార్డు సంస్థ ఒక సాధారణ సర్వీస్‌లా మొదలై, దేశంలో అన్ని రాష్ట్రాల్లో అంచెలంచెలుగా ఎదిగి ఇప్పుడు పోలీస్ విభాగంలో వెన్నెముకలా మారిందన్నారు. జిల్లాలో హోంగార్డుల కొరత ఉన్నప్పటికీ త్వరలో ఆ కొరత లేకుండా కృషి చేస్తామన్నారు. వివిధ కేసుల పరిష్కారం, విధులో నిర్వహణలో వారి సేవలు మరువలేనివని కొనియాడారు. హోంగార్డులకు అలవెన్సులు తక్కువ అయినప్పటికీ మన జిల్లాలో కాకుండా ఇతర జిల్లాల్లో డ్యూటీలు చేస్తూ అన్ని బందోబస్తులు నిర్వర్తిస్తూ విశేష సేవలు చేశారన్నారు. హోంగార్డుల సంక్షేమానికి హెూం గార్డ్స్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా లక్ష రూపాయల వరకు రుణం అందజేస్తున్నామన్నారు. అలాగే హెూంగార్డ్స్ సొసైటీ లో సభ్యత్వం ఉన్నవారికి వైద్య ఖర్చులకు రూ.2లక్షలు, కుమార్తె పెళ్లికి రూ.2లక్షల వరకు రుణాలను క్రెడిట్ సొసైటీ ద్వారా అందజేస్తున్నట్టు తెలిపారు. వీరి పిల్లలకు మెరిట్ స్కాలర్ షిప్‌లు ఇస్తున్నామన్నారు. ప్రమాదవశాత్తు సిబ్బంది మరణించిన వారికి రూ.30లక్షలు బీమా సొమ్మును ఇ-ప్యాకేజి ద్వారా చెల్లిస్తున్నట్టు తెలిపారు. అలాగే హెడ్‌ఆఫీస్ నుంచి ఎక్స్‌గ్రేషియో కింద రూ.5లక్షలు చెల్లిస్తున్నామన్నారు. అంతేకాకుండా వీరి కుటుంబ సభ్యులకు సి కేటగిరి కింద ఉద్యోగం ఇస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో హెూంగార్డ్‌ల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన హెూం గార్డులకు, పెరేడ్‌కు అనుగుణంగా వాయిద్యాలతో శ్రావ్యంగా ప్రదర్శించిన పోలీస్ బ్యాండ్ బృందానికి బహుమతులను అందజేశారు. పెరేడ్ గ్రౌండ్‌లో శాంతికి చిహ్నంగా, హెూంగార్డ్‌ల విభాగానికి చిహ్నమైన పావురాలను ఎగురవేసి కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో పార్వతీపురం సిఐ మురళి, ఆర్‌ఐలు నాయుడు, రాంబాబు, శ్రీనివాసరావు, ఆర్ఎస్సైలు ఇతర పోలీసు అధికారులు, హెూంగార్డులు పాల్గొన్నారు.

హోంగార్డుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు

రిజర్వేషన్లను నిర్వీర్యం చేసే చర్యలను అడ్డుకోవాలి

అంబేద్కర్ వర్ధంతి సభలో కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి - వీరఘట్టం

రిజర్వేషన్లు నిర్వీర్యం చేసే చర్యలను అడ్డుకోవడమే అంబేద్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) నాయకులు పిలుపునిచ్చారు. అలాగే వీరఘట్టం ప్రధాన రహదారి విస్తీర్ణణాభివృద్ధి పనుల్లో భాగంగా అంబేద్కర్ జంక్షన్‌లో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించారని, వీటిని తక్షణమే పునర్నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల కార్యదర్శి ఎన్.సింహాచలం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, అవకాశాలు ఉపయోగించుకొని ఉన్నతమైన ఉద్యోగులుగా, ప్రజాప్రతినిధులు సొంత ప్రయోజనాల కోసం అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనాలు చేకూర్చడమే ధ్యేయంగా పనిచేస్తున్నాయన్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడడమే అంబేద్కర్‌కు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.ప్రసాద్, ప్రజా సంఘాలు నాయకులు దూసి శ్రీనుబాబు, ఎన్.వసంత, దూసి గురయ్య, జె.సింహాచలం, చిన్న తల్లి, పడాల ప్రసాద్ ప్రజలు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుంబురు, ఉపాధ్యాయులు ఎ.వెంకట రమణ, గర్భాన శ్రీను, మహిళా టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ఆణిముత్యం భువనేశ్వరి

క్వీన్స్ ల్యాండ్ యూనివర్సిటీలో సీటు
ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని వేడుకోలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన గేదెల భువనేశ్వరి చదువులో సత్తా చాటి ఆస్ట్రేలియా దేశం క్వీన్స్‌లాండ్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ విభాగంలో పిజి సీటు సాధించింది. భువనేశ్వరి చిన్నప్పటి నుంచి చదువు పట్ల చురుకుదనం, విజ్ఞానం ఆసక్తి ఉండడంతో అగ్రికల్చర్ బిటెక్ కాకినాడలో పూర్తి చేసింది. ఉన్నత చదువులు చదవాలని అగ్రికల్చర్ పిజి కోర్సులో మరింత పట్టు సాధించాలని హైదరాబాదు లో నిర్వహిం చిన ఇంటర్నేషనల్ యూనివర్సిటీ పరీక్ష రాసి అర్హత సాధిం చింది. అయితే రెండేళ్లు చదువుకు 20 శాతం స్కాలర్షిప్ తీసుకోగా రూ.60 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపింది. తన తండ్రి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పటికీ అత్యధిక మొత్తంలో ఫీజు చెల్లించడం భారంగా ఉందని, ప్రభుత్వం కొంతవరకు ఆర్థిక సహాయం అందించాలని కోరుతుంది. వ్యవసాయ పరిశోధనపై మరింత అవగాహన పెంచుకొని రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఆసక్తిగా ఉందని తెలిపింది.

సిఎం మన్యం టూర్ పబ్లిసిటీ స్టంట్

జిల్లాకు ఒరిగింది సున్నా
మాజీ డిప్యూటీ సిఎంలు రాజన్నదొర, పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారి జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, అవన్నీ అడియాశలయ్యాయని మాజీ డిప్యూటీ సిఎం పి.పుష్ప-శ్రీవాణి అన్నారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమెతో పాటు మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే కళావతితో కలిసి మాట్లాడారు. జిల్లా ఎదుర్కొంటున్న అనేక సమస్యల్లో ఏదో ఒక సమస్యకు పరిష్కారం చూపిస్తారని, సాగునీటి ప్రాజెక్టులను మంజూరు చేస్తారని ఆశించారని చెప్పారు. సిఎం చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు విద్యాశాఖ మంత్రి లోకేష్ కేవలం పబ్లిసిటీ స్టంట్ కోసమే జిల్లా పర్యటనకు వచ్చారని విమర్శించారు. మెగా పేరెంట్స్ టీచర్ సమావేశాన్ని ఓ సినిమా షూటింగ్‌లా నిర్వహించారని ఎద్దేవా చేశారు. నాడు-నేడు నిధులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని చెప్పారు. గడచిన 18నెలల్లో టిడిపి ప్రభుత్వం విద్యావ్యవస్థలో చేసిన అభివృద్ధి పనులు ఏమిటని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం హయాంలో 83లక్షల మందికి అమ్మ ఒడి అమలు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం 64లక్షల మందికి తల్లికి వందనం అమలు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు, వసతి దీవెన బకాయిలు వేలాది కోట్లు పేరుకుపోయాయని చెప్పారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో చదువు పూర్తయిన విద్యార్థులకు యాజమాన్యాలు ధ్రువపత్రాలు ఇవ్వడం లేదన్నారు. గిరిజన జిల్లా పర్యటనకు వచ్చిన సిఎం పాల్గొన్న కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి ఆహ్వానం లేదా రావొద్దని చెప్పారా చెప్పాలని డిమాండ్ చేశారు.

మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన జిల్లాలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గ పర్యటనకు వచ్చిన సిఎం ఒక్క సమస్య పరిష్కరించకపోవడం, ఒక్క అభివృద్ధి పని మంజూరు చేయకపోవడం అన్యాయమని అన్నారు. జిల్లాకు చెందిన మంత్రి సంధ్యారాణి అబద్ధాలాడడంలో ఆరితేరి పోయారని చెప్పారు. సాలూరు మండలంలోని మెట్టవలసలో వారం రోజుల్లో పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పిన మంత్రి 18నెలలైనా ప్రారంభించలేదని చెప్పారు. తన హయాంలో జరిగిన, మంజూరైన అభివృద్ధి పనులనే టిడిపి ప్రభుత్వం చేసినట్లు మంత్రి ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. మంత్రి పదవి కాపాడుకోవడానికి ఆమె నానా తంటాలు పడుతున్నారని చెప్పారు. సాలూరులో వంద పడకల ఆసుపత్రి వైసిపి హయాంలోనే 80 శాతం పనులు పూర్తయ్యాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి 18నెలలైనా ఆసుపత్రి నిర్మాణం ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. మంత్రి పిఎ సతీష్, కుమారుడిపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఆరోపణలు వస్తే వైసిపికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అభద్రతాభావంలో అడ్డగోలుగా మాట్లాడుతున్నారని చెప్పారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల్ని సిఎం తన ప్రసంగంలో కనీసం ప్రస్తావించలేదన్నారు. వైసిపి అధినేత జగన్‌ను విమర్శించే అర్హత మంత్రి సంధ్యారాణికి లేదన్నారు. ఇంతటి అసమర్థ మంత్రిని గతంలో ఎన్నడూ చూడలేదని చెప్పారు. తన వద్దకు వచ్చిన బాధిత మహిళల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన మహిళా మంత్రి సంధ్యారాణి అని అన్నారు. మంత్రి తీరుని ఐద్వా వంటి మహిళా సంఘాలు కూడా తప్పుబట్టాయని చెప్పారు. జగన్‌ను తిడితే చంద్రబాబు, లోకేష్ దగ్గర పరపతి పెరుగుతుందని ఆమె అడ్డూ అదుపూ లేకుండా మాట్లాడుతున్నారని చెప్పారు. విలేకరుల సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్తు రాజు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజన్నదొర, పుష్పశ్రీవాణి

విద్యార్థుల తగ్గుదలెందుకు?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం' అంటూ నొక్కివక్కానించి చెబుతున్న ప్రభుత్వం ఆచరణలో భిన్నంగా వ్యవహరిస్తోంది. నిజంగా బడిశాలల బలోపేతం అంటే అందులో విద్యార్థుల సంఖ్య పెరగాలి, ఇందుకనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలి. వారి బోధనకు పూర్తిస్థాయి సమయం ఇవ్వాలి. అలాంటప్పుడు మాత్రమే పాఠశాలల్లో గుణాత్మక విద్య వికసిస్తుంది. కానీ నేడు ఈ అవసరాలకు బదులుగా సమస్యలే పెరుగుతున్నాయి. దీంతో, సిఎం చంద్ర బాబు మాటలకు చేతలకు పొంతన లేదంటూ విమర్శల వెల్లువెత్తుతున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండల కేంద్రంలోని ఎపి మోడల్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్ మీటింగ్ కి సిఎం నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరైన సంగతి విధితమే. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందని, ప్రభుత్వ బడుల్లో ప్రమాణాలు పెంచుతున్నామని, ఈ ఘనత కూడా తమదేనని చెప్పారు. ఈనేపథ్యంలో బాబు, లోకేష్ మాటలు, ఆచరణను విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యరంగంపై కాస్త అవగాహన ఉన్నవారు భేరీజు వేస్తుండగా, చదువుల కోసం అప్పులు చేయాల్సివస్తుందంటూ అక్షర జ్ఞానం లేని తల్లిదండ్రులు సైతం వాపోతున్నారు. వాస్తవ పరిస్థితులు కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి. నిజంగా బాబు చెప్తున్నట్టు విద్యావస్థ బలోపేతం అయితే, ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల శాతం ఎందుకు తగ్గుతోంది. మన్యం జిల్లాలో గడిచిన పదేళ్లగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఈమాటకొస్తే పాఠశాలలు కూడా తగ్గిపోయాయి. పోనీ, గత ప్రభుత్వం ఆ పాఠశాలలను మూసేసిందనుకుంటే, ఈ ప్రభుత్వం వచ్చాక ఏమైనా పెంచిందా? దీనికి ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. వాస్తవానికి గత వైసిపి, నేడు కూటమి ప్రభుత్వాలు రెండూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రూపొందించిన నూతన విద్యావిధానమే అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే గిరిజన ప్రాంతాల్లో బడిశాలల మూత మొదలయ్యాయి. ఫలితంగా చాలా మంది గిరిజన విద్యార్థులు చదువుకు దూరమౌతున్నారు. ప్రభుత్వ పాఠశాలల నుండి జారిపోతుంటే, ఇది బలోపేతానికి సంకేతమా? లేక బలహీనతా? గుడ్డికన్నా మెల్లనయం అన్నట్టుగా గత ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులు తీయని పరిస్థితుల్లో నేటి కూటమి ప్రభుత్వం డిఎస్‌సి నియమాకాలు చేపట్టడం మంచిదే. కానీ, ఇదే గొప్పగా చెప్పుకుంటే సరిపోతుందా? పాఠశాలలను మూసివేయడం, మెర్జి చేయడం, ద్వారా విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణమై చివరికి ప్రైవేటు కన్నా ప్రభుత్వ స్కూళ్లల్లోనే ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పుకోవడం ఎంత వరకు సమంజసం అని ఉపాధ్యాయులు, విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు.

విద్యా సంవత్సరం మొదలైన రోజు నుంచే పాఠాలు చెప్పే అవకాశాన్ని యాప్‌లు, రికార్డులు, మీటింగ్‌లు, అప్రయోజక కార్యక్రమాలు అడ్డుకుంటున్నాయి. బోధనేతర పనులు ఉపాధ్యాయుల సమయాన్ని పూర్తిగా ఆక్రమిస్తున్నాయి. పరీక్షల మూల్యాంకనం గందరగోళంగా ఉందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 9 రకాల పాఠశాలలతో గందరగోళం పెరిగింది. ఈ పరిస్థితుల్లో విద్యను బలోపేతం చేస్తామనడం ఎలా నమ్మాలి? ఉపాధ్యాయుల బోధనకన్నా డిజిటల్ ట్రాకింగ్, యాప్‌లు, గణాంకాలు ముఖ్యమయ్యాయి. పిల్లల అభ్యసనానికి అవసరమైన వాతావరణం బలహీనమైంది. ప్రభుత్వ పాఠశాలలు నిజంగా బలపడాలంటే నష్టదాయక సంస్కరణల తక్షణ రద్దు చేయాలి. నూతన విద్యావిధానాన్ని పక్కన బెట్టి, రాష్ట్ర అవసరాలకు అనుగుణమైన విధానం అమలు చేస్తే విద్యార్థులు పెద్దయ్యాక ఉద్యోగ, ఉపాధి సమస్య ఉండదు. ముఖ్యంగా ఉపాధ్యాయులను పూర్తిగా బోధనకే పరిమితం చేయాలి. పరీక్షా, మూల్యాంకన విధానాల పునర్విమర్శ, ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేక నిధుల కేటాయింపు చేయాలి. కేవలం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశాలు ఏర్పాటు చేస్తే సరిపోదు. ఇందులో విద్యావేత్తలను భాగస్వామ్యం చేస్తే తగిన సలహాలు, సూచనలు అందుతాయని జనం చర్చించు కుంటున్నారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజా సమస్యలకు పరిష్కారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజా దర్బార్ నిర్వహణతో ప్రజా సమస్యల పరిష్కారానికి వీలుతుందని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు ఐదు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి వినతులు అందించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటికి తక్షణ పరిష్కారం చూపుతున్నామన్నారు. వచ్చిన సమస్యలను సంబంధిత శాఖాధికారులతో వెంటనే మాట్లాడి, పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఉన్నారు.

9న బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 9న ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ శనివారం ప్రకటనలో తెలిపారు. జడ్పిటిసి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు విధిగా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి -వీరఘట్టం

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నడుకూరుకు చెందిన మత్స పోలినాయుడు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఉదయాన ఉదయభాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, మత్స వెంకటరమణ, వెలగాడ శ్రీనివాసరావు, చింత ఉమామహేశ్వరరావు, ఎన్.శశికుమార్,పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వీరేష్‌చంద్రదేవ్

బాధిత కుటుంబాలకు వీరేష్ పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో ఇటీవల అనారోగ్యం బారిన పడి మృతి చెందిన పలు కుటుంబ సభ్యులను టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ శనివారం వారి ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడి వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. పార్టీ తరపున పూర్తిస్థాయి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చి ధైర్యంగా ఉండాలన్నారు. ఏ అవసరం వచ్చినా వెంటనే తనను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, కూటమి నాయకులు ఎన్.వంశీ, కర్రి శ్రీను, సుకేష్ చంద్ర పండ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 'జన వాణి'

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నిమ్మక జయకృష్ణ తన క్యాంపు కార్యాలయంలో జనవాణి కార్యక్రమం శనివారం నిర్వహించారు. నియోజకవర్గ స్థానిక ప్రజల అభిప్రాయాలను స్వాగతిస్తూ, వారి సమస్యలు, అభ్యర్థనలు నేరుగా విన్నవించుకున్నారు. కార్యక్రమంలో ప్రజల ఇబ్బందులు, అభ్యర్థనలను స్వీకరించి, వాటి సమగ్ర పరిష్కారానికి తగిన చర్యలను తక్షణమే చేపట్టేందుకు నిర్వాహక అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఈ కార్యక్రమం ద్వారా స్థానికులు తమ కష్టాలు, అభ్యర్థనలను అందించడంలో సౌకర్యాన్ని పొందినట్టు తెలుస్తోంది. అస్థిర పరిస్థితులను బట్టి నియోజకవర్గ అభివృద్ధికి ప్రతిష్టాత్మక మార్గదర్శకాలు రూపొందించడంలో ఈ జనవాణి కార్యక్రమం కీలకమైందని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.4లక్షల 70 వేలు చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, ఎంపిపి ప్రతినిధి సుధా, వైస్ ఎంపిపి వాకుమూడ అనిల్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ సత్తిబాబు, జాడ శ్రీధర్, గంట సంతోష్, వెన్నపు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్, గ్రామపెద్దలు

బలిజిపేటలో ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలో పలగరలో శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సిహెచ్ సీతారాం, యూనిట్-1 పిఒ బి.మురళీధర్ ఆధ్వర్యా నిర్వహించారు. సర్పంచ్ గౌరమ్మ మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా దృక్పథం పెంపొందించేలా ఈ సేవా కార్యక్రమం తోడ్పడుతుందన్న ముఖ్యో ఉద్దేశంతో ప్రారంభించారని తెలిపారు. ఎంపిటిసి సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరింత పురోగతిని సాధించాలని కొనియాడారు. మండలంలో స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ బలిజిపేట సర్పంచ్ రాగలత, తెలుగుదేశం కార్యకర్తల ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమం అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈనెల 12 వరకు నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్ఎస్ యూనిట్-2 పిఒ తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు భోగ రామారావు, అరకు పార్లమెంటరీ నాయకులు రామకృష్ణ, అధ్యాపకులు పి రామారావు, వి.రామకృష్ణ, ఎం. గౌరు నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు శరణ్య ఎంపిక

ప్రజాశక్తి కొమరాడ

జాతీయస్థాయి టెన్నిస్, వాలీబాల్ టోర్నమెంట్‌కు మండలంలోని దుగ్గికి చెందిన కారు శరణ్య ఎంపికైనట్లు స్థానికులు తెలిపారు.



శరణ్యను అభినందిస్తున్న గ్రామస్తులు

ఈ సందర్భంగా శనివారం గ్రామస్తులు శరణ్యను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. జాతీయస్థాయిలో క్రీడల్లో ప్రతిభ కనబర్చి మండలానికి, గ్రామానికి మంచి పేరు తేవాలని తల్లిదండ్రులు నాగరాజు, నాగమణి శరణ్యను అభినందించారు. అనంతరం దుగ్గి గ్రామానికి చెందిన పిట్ట తిరుమేశ్వరరావు, పిట్ట తిరుపతి (ఫీల్డ్ అసిస్టెంట్), యజ్జల ప్రసాద్, గ్రామ పెద్దల సమక్షంలో శరణ్యకు చిరు సత్కారం చేశారు. గ్రామంలో ఉన్న వద్దులకు, వికలాంగులకు పిట్ట తిరుమలేశ్వరరావు దుప్పట్లు పంపిణి చేశారు.

పలుచోట్ల అంబేద్కర్‌కు ఘన నివాళి

పార్వతీపురం : అంబేద్కర్‌కు నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

భారత రాజ్యాంగ నిర్మాణ బాబా సాహెబ్ బిఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అంబేద్కర్ ఆశయ సాధనకు కృషిచేస్తామని, ఆయన రచించిన రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతినబూనారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గల అంబేద్కర్ విగ్రహానికి మండల టిడిపి నాయకులు సలహారి గోపాలరావు, బుడితి శ్రీనివాసరావు, జొన్నాడ గరికయ్య పూలదండలు వేసి నివాళులర్పించారు. అలాగే బొక్కుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణదాస్, ఉపాధ్యాయులు గౌరీ శంకర్ అంబేద్కర్ విగ్రహానికి పూలు మాల వేసి నివాళులర్పించారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి కురుపాం నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు మీసాల ఫ్రాన్సిస్, కోలక జయరాంతో పాటు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు పాలక దేవానంద్, పార్టీ ముఖ్య కార్యకర్తలు పాలక సంపత్ కుమార్, గంట రాహుల్ సాయి, బిడ్డిక శ్రీధర్, ఆటో యూనియన్ ప్రతినిధులు నర్సిపురం బొందు, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పట్టణంలో గల అంబేద్కర్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే బి.విజయచంద్ర పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే భారతదేశాన్ని సమగ్రంగా నడిపిస్తోందని వెల్లడించారు. సమాజంలో ఏ సమస్య వచ్చినా దాని పరిష్కారం అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే లభిస్తోందన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

కొమరాడ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ సెంటర్ వద్ద డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు లక్ష్మయ్య పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : స్థానిక జిల్లా ఆసుపత్రి జంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు బత్తిన మోహనరావు, వంగల దాలినాయుడు, సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, జమ్మాన బుజ్జి, తీళ్ల గౌరీశంకరరావు, చొక్కాపు వెంకటరమణ, కోలా కిరణ్ కుమార్, గేదెల రామకృష్ణ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ రాజ్యాంగం పక్కాగా అమలయ్యే రోజున భారతదేశంలో ఆర్థిక, రాజకీయ, కులమత, బేధాలు ఉండవన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం పక్కాగా అమలు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సాలూరు : స్థానిక వైసిపి కార్యాలయంలో నాయకులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు గిరి రఘు, పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, పిరిడి రామకృష్ణ, హరి బాలాజీ, జరజాపు శ్రీను, కాకి రంగా, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు : అంబేద్కర్‌కు నివాళ్లు అర్పిస్తున్న వైసిపి పట్టణ నాయకులు

ప్రతిజ్ఞ చేస్తున్న ఎఎస్‌పి మనీషారెడ్డి, అధికారులు

యువత మత్తుకు బానిస కావొద్దు : ఎఎస్‌పి

ప్రజాశక్తి - సీతానగరం

యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసకారాదని ఎఎస్‌పి మనీషా రెడ్డి అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో అవగాహన సదస్సు జరిగింది. ముందుగా మండలంలోని పెద్ద అంకలాంలో అభ్యుదయ సైకిల్ యాత్ర బృందానికి ఆహ్వానం పలికారు. అనంతరం సీతానగరం చేరుకుని సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉండాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు, వారి భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందన్నారు. విద్యా సంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎల్ ప్రసాద్, ఎంఇఒ జి.సూరిదేముడు, ఎస్సై రాజేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ.ప్రసన్నలక్ష్మి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పాలకొండ

విశాఖలో జరిగే సిఐటియు 18వ జాతీయ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ గోడపత్రికను ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీ ఫెడరేషన్ నాయకులు శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు ఐదు రోజుల పాటు విశాఖ కేంద్రంగా సిఐటియు జాతీయ మహాసభలు జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభల్లో ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ, అసంఘటితరంగా కార్మికుల సామాజిక భద్రత, స్కీం వర్కర్ల సమస్యలపై, కనీస వేతనం రూ.26వేలు సాధించేందుకు, కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లను తిప్పికొట్టేందుకు, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల భద్రత, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, మహిళల పని భద్రత అంశాలపై మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలపై చర్చించడం జరుగుతుందన్నారు. జనవరి 4న విశాఖ ఆర్కే బీచ్ లో భారీ బహిరంగ సభకు పాలకొండ ప్రాంతం నుండి యావత్ కార్మిక వర్గం తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిహెచ్ సంజీవి, పి.భాస్కర్ రావు, వి.ఆంజనేయులు, బి విశ్వేశ్వరరావు, పి.మధు, ఎన్.ప్రశాంతి, రామారావు, పి.గిరి తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

బలిజిపేట : విశాఖలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలంటూ రైస్ మిల్ హమాలీస్ వర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా మహాసభల కరపత్రాలువిడుదల చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ విశాఖలో జరుగుతున్న ఆలిండియా మహాసభలకు అన్ని రంగాల కార్మికులు జనవరి 4న బహిరంగ సభకు వచ్చి మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైస్ మిల్లు కార్మికులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మండల పరిషత్ నిధుల దుర్వినియోగంపై ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం విచారణకు వచ్చిన జిల్లా పరిషత్ సిఇఒ బివి సత్యనారాయణ దర్యాప్తు ప్రారంభించకుండానే వెనుదిరిగారని చంద్రశేఖర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో చేయని పనులకు నిధులు డ్రా చేసినట్టు స్పష్టమైన ఆధారాలు చూపినా, అధికారులు వెంటనే దర్యాప్తు ప్రారంభించకుండా వెనక్కి వెళ్లిపోవడం ఆశ్చర్యకరమన్నారు. తూతూ మంత్రంగా దర్యాప్తు చేస్తామని చెప్పే అధికార యంత్రాంగానికి ప్రజలు ఎందుకు పిజిఆర్ఎస్ ద్వారా వినతులు ఇవ్వాలా?" అని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి నిధులు కొందరి చేతుల్లో ఎక్కడికి పోతున్నాయనేది ప్రజలకు తెలుసునని, విచారణకు వచ్చిన ఉన్నతాధికారి కూడా సరైన చర్యలు తీసుకోకుండా వెనుదిరగడం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. ఇటువంటి సందర్భంలో అధికార లాబీయింగ్‌కు లొంగకుండా పక్కాగా దర్యాప్తు ప్రారంభించి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలో నిధుల వినియోగంపై మళ్లీ వివాదం చెలరేగింది. గ్రామస్థులు కూడా దర్యాప్తు పారదర్శకంగా జరిగి అసలు నిజాలు బయటపడాలని కోరుతున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

విచారణలో పాల్గొన్న జెడ్‌పిసిఇఒ సత్యనారాయణ

'జగన్‌ను విమర్శించే అర్హత సంధ్యారాణికి లేదు'

ప్రజాశక్తి - పాలకొండ

వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డిపై గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఇష్టానుసారంగా మాట్లాడే అర్హత లేదని, నోరు అదుపులో పెట్టుకోవాలని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. శనివారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ స్వగృహంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ పర్యటన సందర్భంగా సంధ్యారాణి జగన్ మోహన్ రెడ్డిపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అసమర్థ మంత్రిగా పేరు తెచ్చుకున్న సంధ్యారాణి పార్టీ అధినేతల మెప్పుకోసం జగన్‌పై నోటిక్కొచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. గిరిజన విద్యార్థులు మృతి చెందితే మంత్రి పట్టించుకోలేదన్నారు. సీతంపేట మండలం హడ్డుబంగికి చెందిన విద్యార్థి అనారోగ్యంతో మృతి చెందితే కనీసం మాట్లాడలేదన్నారు. మంత్రి పిఎ, డ్రైవరు ఒక మహిళా ఉద్యోగిని ఏ విధంగా వేధించారో అందరికీ తెలుసన్నారు. గిరిజనులు సిగ్గుపడేలా సంధ్యారాణి ప్రవర్తిస్తున్నారన్నారు. మంత్రి వైఖరి మారాలన్నారు. సిఎం నియోజకవర్గంలో పర్యటించడం వల్ల ప్రజలకు ఏ ప్రయోజనం కలగలేదన్నారు. జీవో 3 గురించి మాట్లాడలేదన్నారు. ప్రతి వసతి గృహంలో ఎఎన్ఎంలు నియమిస్తామని ప్రకటించి ఇప్పుడు సచివాలయ ఎఎన్ఎంలతో పని చేయిస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. తల్లికి వందనం, గ్యాస్ సబ్సిడీ అర్హులకు అందడం లేదన్నారు. తోటపల్లి, జంపర్ కోట జలాశయాలను వదిలేశారన్నారన్నారు. ఆర్‌బికెలను నాశనం చేసి ధాన్యం కొనుగోలు చేయడంలేదన్నారు. వైసిపి హయాంలో విద్యారంగంలో అనేక సంస్కరణ తీసుకొచ్చారన్నారు. విలేకరుల సమావేశంలో మండల, పట్టణ వైసిపి అధ్యక్షులు కనపాక సూర్య ప్రకాష్, వెలవల మన్మధరావు, వీరఘట్టం ఎంపిపి డి.వెంకటరమణనాయుడు, నాయకులు పాలవలస ధవళేశ్వరరావు, లిల్లీ పుష్పనాధం, కడగల రమణ, దుప్పాడ పాపి నాయుడు, పల్లా భాను, తిర్లంగి ఉపేంద్ర, ఆర్.రాంబాబు, నెల్లి శివప్రసాద్, దుర్గారావు తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మక్కువ

మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోరుతూ ఆ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద నిర్వాహకులు శనివారం నిరసన తెలిపారు. అనంతరం ఎంఇఒకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఎపి మధ్యాహ్న భోజన పథకం గౌరవాధ్యక్షులు జి.కృష్ణారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు మాట్లాడుతూ అతి తక్కువ జీతానికి నిర్వాహకులు పనిచేస్తున్నారని, పెరుగుతున్న ధరలకు తగ్గట్టుగా జీతాలు పెంచాలని కోరారు. విద్యార్థులకు ఇస్తున్న మెస్‌ఛార్జీలు ప్రస్తుతం మార్కెట్ ధరలకు భారీవ్యత్యాసం ఉందని, కావున మెస్ చార్జీలను పెంచి చెల్లించాలని కోరారు. అనేక పాఠశాలల్లో వయసు పైబడిందన్న కారణంతో నిర్వాహకులను విధుల నుంచి తప్పిస్తున్నారని, అలాంటి వారి కుటుంబ సభ్యులను నియమించుకొనేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు, యూనిఫాం, ప్రమాదం జరిగినప్పుడు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా సమావేశాలు నిర్వహించి టిఎ, డిఎ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండలం నాయకులు ఎం.కృష్ణ, పార్వతి, గంగ, రాధ, లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రాన్ని అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కిమ్మిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మిలో శనివారం స్థానిక వైద్యాధికారి ఎం.సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, రక్తపోటు, మధుమేహ, చిన్నారులు, జ్వర పీడితులు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శు భారాతమని, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న స్థానిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులు గెలిపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జియ్యమ్మవలస మండల స్థాయి టిడిపి నాయకులు, కార్యకర్తలతో మండల అధ్యక్షులు జోగి భుజంగరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, పార్టీ బలోపేతం, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడం పార్టీ బాధ్యత అని పేర్కొన్నారు. మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరు శాతం కూటమి అభ్యర్థులనే గెలిపించేలా కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకునేలా కార్యాచరణ రూపకల్పన చేయాలని అన్నారు. పార్టీ అభివృద్ధి, ప్రజా పరిచయం, గ్రామ స్థాయి ఎన్నికల వ్యూహాలపై ఎమ్మెల్యే నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎన్‌సిడి సర్వే పక్కాగా చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

అసంక్రమిత వ్యాధి లక్షణాలు గుర్తించే లక్ష్యంగా ఎన్‌సిడి సర్వే నిర్వహించాలని జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు స్పష్టం చేశారు. మండలంలోని చినబొండపల్లి, నర్సిపురం హెల్త్, వెల్నెస్ కేంద్రాలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రంలో ఆరోగ్య సేవలపై ఆరా తీసి, ఒపి, హెల్త్ సర్వే రికార్డులు తనిఖీ చేశారు. ప్రతి ఆరోగ్య సమస్యను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. అక్కడ నిర్వహించిన సంచార చికిత్సా శిబిరంలో దీర్ఘకాలిక రోగుల పర్యవేక్షణ, చికిత్సా వివరాలు పరిశీలించారు. వైద్య పరీక్షలకు వచ్చిన వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం ప్రతి నెలా ఏ మేరకు మెరుగు పడుతుందో దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న అసంక్రమిత వ్యాధుల సర్వే జరుగుతున్న తీరు, ఆన్లైన్ నమోదు పరిశీలించారు. రక్తపోటు, మధుమేహం, కేన్సర్ మొదలగు దీర్ఘకాలిక రోగ లక్షణాలు గుర్తించి సకాలంలో వ్యాధి నిర్ధారణ, చికిత్సా అందేలా కార్యాచరణ చేయాలన్నారు. ముఖ్యంగా కేన్సర్ లక్షణాలు గుర్తించడంలో ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశించిన లక్ష్యాలు చేరాలని ఆదేశించారు. అనంతరం కేంద్రంలో మందుల లభ్యత పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో గిరిబాబు, వైద్య సిబ్బంది రాజేశ్వరి, పద్మావతి, ప్రమీల,104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రం, మేజర్ పంచాయతీ మక్కువలో శనివారం పారిశుధ్య పనులు చురుగ్గా చేపట్టారు. స్థానిక పంచాయతీ ఇఒ బెహరా శ్రీనివాస్ దగ్గరుండి ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తాచెదారాలను తొలగించే పనులను కార్మికులతో చేపట్టారు. మజ్జి గౌరమ్మ గుడి నుంచి స్థానిక మండల పరిషత్ కార్యాలయం వరకు వెళ్లే రహదారిని శుభపరిచారు. అలాగే మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే రహదారి అంచున ప్రమాదాన్ని గుర్తించేలా గుర్తులను ఏర్పాటు చేశారు. మక్కువ సచివాలయాల్లో వివిధ పోస్టులు భర్తీ కావాల్సి ఉందని, పంచాయతీలో వసూలు కావాల్సిన పన్నులతో పాటు ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామని ఇఒ శ్రీనివాస్ తెలిపారు. పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ వినియోగం, వ్యర్థాల నిర్మూలనకు కొంత సమయం పడుతుందన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - సాలూరు

మధ్యాహ్నం భోజనం పథకంలో విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంపిడిఒ జి.పార్వతి నిర్వాహకులకు సూచించారు. శనివారం మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తహశీల్దార్ నీలకంఠారావుతో కలిసి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు ను తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆమె మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులతో మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని మెనూ ప్రకారము అందించాలన్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టడం లేదని కలెక్టర్ గ్రీవెన్స్‌కు పాత భోజన నిర్వాహకులు ఫిర్యాదు చేసారు. ఈ ఫిర్యాదు మేరకు దర్యాప్తునకు ఎంఇఒతో పాటు వచ్చినట్టు ఆమె తెలిపారు.

రెండు టన్నుల పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - సాలూరు

ఒడిశాకు అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉన్న సుమారు రెండు టన్నుల పిడిఎస్ బియ్యాన్ని స్పెషల్ నిఘా పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. స్పెషల్ నిఘా సిఐ బి.సింహాచలం తెలిపిన వివరాల ప్రకారం శనివారం తెల్లవారుజామున సుమారు 4 గంటలకు నిఘాధికారులతో కలిసి మండలంలోని సారికలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిందితుడు ఎస్ఆర్‌టిపి మహేష్ రాజు వద్ద ఉన్న ఆటోలో ఒడిశాకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన పెద్ద మొత్తంలో పిడిఎస్ బియ్యం బస్తాలను గుర్తించారు. సుమారు రెండు టన్నుల బియ్యాన్ని అధికారులు తక్షణమే స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ప్రభుత్వ గోడౌన్‌కు అప్పజెప్పినట్లు తెలిపారు. అలాగే ఈ అక్రమ రవాణాకు పాల్పడిన నిందితుడు మహేష్‌రాజుపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సై బివి సతీష్ కుమార్, సిఎస్‌డిటి మౌలాలీ, సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారులు ఆటోతో పట్టుకున్న పిడిఎస్ బియ్యం

'ఉద్భవ్'కు ఎస్‌టి కమిషన్ మెంబర్ మల్లేశ్వరరావు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎపి గిరిజన సంక్షేమ ఆశ్రమ విద్యా సంస్థల సొసైటీ ఆధ్వర్యంలో గుంటూరు వడ్డేశ్వరం కెఎల్ విశ్వ విద్యాలయంలో 6వ జాతీయ ఇఎంఆర్ఎస్ సాంస్కృతిక, సాహిత్య ఉత్సవం, కళా ఉత్సవం 'ఉద్భవ్'-2025' ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌టి కమిషన్ మెంబర్ కద్రక మల్లేశ్వరరావు పాల్గొన్నారు. దేశం నలుమూలల నుంచి చేరుకున్న గిరిజన విద్యార్థులు తమ సంస్కృతులను ప్రతిబింబించే కళా ప్రదర్శనలు అందరి మనసులను కట్టిపడేశాయి. విజేతలకు గిరిజన సంక్షేమం, మహిళా, బాల సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు.